# తేలుకుట్టిన దొంగలు

అవసరాల రామకృష్ణారావు

ఒక్కొక్కప్పుడు ప్రకృతివల్లనో, చతురమతుల మెత్తని చెప్పుదెబ్బలవల్లనో మనం రహస్యంగా చేసిన నేరాలకి చల్లచల్లగానే చీవాట్లు తగలడం సంభవిస్తూ ఉంటుంది. అలాటి తేలుకుట్టిన దొంగ మనస్తత్వాలు నాలుగు ఓచోటుచేర్చి చెప్పుకుంటే కాస్సేపు కాలక్షేపం, కాస్త వినోదం, మరికాస్త మనస్సుకి హాయిని.

* * *

ఫలాన ఊరు హైస్కూలు సోషల్ స్టడీస్ పేపర్లు రామయ్యగారికి వచ్చేయని అతి ప్రయత్నంమీద ఈశ్వరనాయుడుగారికి తెలిసింది. ఆయనకి యిందులో యింట్రెస్టు ఏమిటంటే ఆయన తమ్ముడికొడుకు ఆ ఫలాన ఊరులో చదువుతున్నాడు. వాడికి సోషల్ స్టడీస్ ఒక్క పిసరు రాకపోగా చదవమన్న వాళ్ళనందర్నీ ఓప్రశ్నతో బాధిస్తున్నాడు. "కిల్లంపూడి అగ్రహారం మా వూరికి ఎన్ని మైళ్ళదూరంలో ఏ దిక్కున ఉందో- అసలు ఉందో లేదో కూడా తెలియని సోషల్ స్టడీస్ టీచరికి భూమధ్యరేఖ ఎక్కడ్నించిపోతే ఎందుకు? బోడి మెట్టమీంచిపడితే ఎంత దెబ్బ తగులుతుందో తెలియనివాడికి ఎవరెస్టు ఎత్తెందుకు? గూడకట్టుతో క్లాసులోకొచ్చి పాఠాలు చెప్పే పంతులికి ఆర్యులు ఏ దుస్తులు ధరిస్తే ఎందుకు?" ఇంతలా అవమానపరచిన ఆ సబ్జక్టు వాడిమీద పగతీర్చుకుని మూడుసార్లు ఫెయిల్ చేసింది. వాడి పెదతండ్రికి మార్కులవేటా తప్పలేదు. ఆయన సరాసరి రామయ్యగార్ని కలుసుకున్నాడు. సంగతంతా విశదపరచి మార్కుకి రూపాయిచొప్పున రైటు చేసుకున్నారు. ఈశ్వరరావుగారు పర్సుతీశారు.

"మీరు వెయ్యండి ఇదుగో సొమ్ము లెక్కపెట్టి యిచ్చెయ్యడమే" రామయ్యగారు మార్కులు వేసి రైటయిపోవడంవల్ల మార్కుల పుస్తకాలు రిజష్టర్డుకి పంపేరు.

"అయ్యో నామతి మండ, సొమ్ము తెచ్చావనుకున్నానండోయ్! వెరీ సారీ-యింటికెళ్ళి యిప్పుడే పంపించేస్తాను" ఈశ్వరరావునాయుడు తరువాత రామయ్యకి కనిపించలేదు. ఆయన ఎడ్రసు తెలుసు, యిల్లు తెలుసు-కాని ఏం లాభం? ఏ మొహం పెట్టుకుని వెడతాడు, ఏమని అడుగుతాడు? ఎవరితో చెప్పుకుంటాడు?

పెద్దవాళ్ళకి యిష్టంలేని సరదాలు మనకున్నపుడు ఒక్కొక్కప్పుడు కనుగప్పి చెయ్యవలసి వస్తూంటుంది. మాకందరికీ "పెళ్ళి చేసిచూడు" నాలుగోసారి చూడాలనుంది. ఆడవాళ్ళూ, పిల్లలూ, చికటి రాత్రీ చలిగాలీ. ఏం సబబైన కోరిక! కాని మేం మా ప్రయత్నాలు మానలేదు. మాయింట్లో తొమ్మిదీ తొమ్మిదిన్నరకి అంతా పడుకుంటారు. నేనూ, రామం, వదినా తమ్ముడూ అందరం సెకండ్‌షోకి ప్రిపేర్ అయ్యాం. తొమ్మిదింటికీ అందరం డాబామీదకిచేరి గుప్‌చప్‌గా మేలుకొని ఉన్నాం. తొమ్మిదిన్నరా కొట్టేసరికి అడుగులో అడుగు వేసుకుంటూ, మధ్యమధ్య కాషన్సు యిచ్చుకుంటూ నెమ్మదిగా పెరటిగుమ్మం చేరేం. నెమ్మదిగా గడియతీసి అవతలకి పోయి గొళ్ళెంపెట్టి .తాళంవేసి సినిమాకి నడిచిపోయేం. అంతవరకూ బాగానే ఉంది. మేమూ వెళ్ళనిచ్చి కలకత్తానుంచి మా చిన్నమామ పాసెంజర్లో వచ్చాడుట. సూక్ష్మగ్రాహి మా అమ్మ చిటికెలో అంతా గ్రహించేసింది. ఇదంతా మాకేం తెలుసూ? మేం యధాప్రకారం రెండున్నరకి చడీ చప్పుడూ లేకుండా వచ్చి, ఎవరూ లేవకపోవడం చూసి, పది బస్తాల బరువు ఒక్కసారి దింపుతున్నట్టు ఫీలయి హాయిగా పడుకున్నాం. మా ప్లాను యింత క్షుద్రంగా ఫెయిల్ అవుతుందని మాకేం తెలుసూ? తెల్లారి లేచాక మా అమ్మా మా మావా కలిసి అందరికన్న పెద్దదని కాబోలు వదిన్ని పెట్టిన చీవాట్లు. ఇన్నీ

అన్నీ కావు. మావదిన ఎరక్కపోయి అడిగింది.

"నువ్వు రాత్రి వచ్చావా, యెన్నింటికి చిన్నాన్నా?"

"పదకొండు అవుతుందేమో-సరిగ్గా రెండో ఆట సినిమా అవుతూ ఉంటుంది."

వదిన గతుక్కుమంది. మా మావ మళ్ళీ అన్నాడు.

"నీకేం తెలుసూ? అరిచేతిలో అగ్గిరుగుదువా? డాబామీద పడుతున్నావు కాబోలు" అమ్మ అందుకుంది.

"పడుకునే ఉంటుంది. అయినా నిద్దర్లో నడవడం ఆ అమ్మాయి కలవాటులే."

"సరేగాని, సరోజా, నిన్న రాత్రి పన్నెండు దాటేక నువ్వొగాని వీధిలోకొచ్చావా?"

"అదేమిటి చిన్నాన్నా, నే నెందుకు వస్తానూ?"

"ఎవరో పిల్ల ముగ్గురు పిల్లల్ని వెంటేసుకుని సినిమా కెళుతోందిలే" వదిన అక్కడ నిలబడలేక పోయింది. కాని అమ్మ మాటలు వినపడుతూనే ఉన్నాయి.

"మా కోడలు ఎందుకు వెడుతుందీ? ఎవరో రాలుగాయి అయివుంటుంది. ఐనా యీ కాలపు పిల్లలకి బొత్తిగా చిన్నా పెద్దా మంచీ చెడ్డా లేవమ్మా! అర్ధరాత్రీ, ఆడదీ వంటెడు నగలూ, ఆ పిల్ల ఎవరో ఎంత సరదా అయితే మాత్రం అంతజ్ఞానం లేకపోయిందా? నువ్వయితే అలా చేస్తావా సరోజా?" వదిన అక్కడలేదు.

* * *

మా బంధువుల అబ్బాయి ఒకడు వాల్తేరులో బియ్యే చదువుతున్నాడు. ఒక్కొక్క పార్టు కనీసం నాలుగుసార్లు ఎపియర్ అవుతున్నాడు. తండ్రి నెలకి రెండొందలకి తక్కువ కాకుండా పంపుతున్నాడు. వాడా సొమ్ము ఖర్చుపెట్టుకుని ఎన్నివిధాల వస్తే అన్నివిధాల వినోదం కొనుక్కుని జల్సాగా తిరుగుతున్నాడు. సెంటువాసన, మందువాసన యివి రెండూ వాడిని ఆ వూరు వదల నియ్యడంలేదు. ఎక్కడ పాసైపోతానో అని ఆ పార్టుల్ని లోభి సొమ్ము వాడినట్టు వాడుకుంటున్నాడు. ఇంత హీనచరిత్ర తెలిసికూడా తండ్రెందుకు యింకా సొమ్ము పంపుతున్నాడని సామాన్యుల సందేహం. దానికి తండ్రి చేతిలో ఉన్న ఉత్తరమే సమాధానం. నన్ను చివాట్లు పెట్టడానికి నీ సంస్కారం ఎలాంటిది? మనం ఈ లోకంలో వీలయినంత అనుభవించడానికే వచ్చామనే మన పూర్వుల వంశమర్యాద ఎవరికి తెలియనిది? అక్కడిదాకా ఎందుకు? ఏభై అయిదేళ్ళు పైబడిన నీకు మాంసాహారం కాంతా విహారం ఎందుకు?"

* * *

నేరంచేశాడని లోకవిదితమైనా శిక్షపడని పాపిష్టిరోజులు యివి. మర్యాదతోనూ, డబ్బుతోను, దేశభక్తితోను నేరాల్ని కనపడకుండా చెయ్యతలుగుతున్న రోజులు యివి. పదిమంది బీదవాళ్ళ కడుపుకొట్టి పెద్దవాడై వారికి ఏ అవసరమూ తీర్చని నాయకుడికి కనీసం అతని మునిమనవడైనా కంటకప్రాయుడైతే చూసేవారికి కాస్త మనశ్శాంతి కలుగుతుంది. ఒకేరోజు ముగ్గురి కుర్రాళ్ళ అరచేతులు అంగుళం మందం పెంచిన టీచరుకి చివరకి మరదలైనా మాటల్లో నాలుగు చల్లగా అంటిస్తే విన్న వాళ్ళు నవ్వుకుంటారు. పుట్టినదగ్గిర్నుంచీ "పీడిధర యింత" అని లెక్కగట్టి కొడుకుల్ని చదివించి అమ్మజూసే పెద్దమనిషికి కనీసం ఒక్కకొడుకైనా బీదపిల్లని ఊరికే పెళ్ళాడి వారి అప్పులు తన పేర తద్వారా తండ్రిపేర ఫిరాయిస్తే విన్న వాళ్ళకి విందుగా ఉంటుంది. అలాంటిరోజులు వస్తాయి, ఎదురు చూద్దాం.

---

ఇద్దరు ఘరానా మనుషులు ఎదురెదురుగా సన్నని వంతెనమీందనుండివస్తూ మధ్యలో ఆగిపోయారు. ఎవరో ఒకరు పక్కకి తప్పుకుంటేగాని, రెండవవాళ్ళు ముందుకు సాగడానికి వీల్లేదు. అందులో ఒకడు గుడ్లెర్రచేసి, "అడ్డగాడిదలకి నేను దారి ఇవ్వను!" అని ఉరిమాడు.

రెండవవాడు వెంటనే "నేను యిస్తాను!" అని దారి యిచ్చాడు.